సాక్షి
కుమురం భీం

బుధవారం : 20 : సెప్టెంబర్ : 2023



సీజన్‌కు ముందే సీతాఫలం!

ఈ ఏడాది చలికాలానికి ముందే సీతాఫలాలు మార్కెట్‌లోకి వచ్చేశాయి. భారీ వర్షాలు కురియడంతో దిగుబడి ముందుగానే వచ్చింది. 8లో▸



మరణంలోనూ వీడని బంధం

ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములిద్దరినీ రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. ఈ ఘటనలో మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /25.1

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

పర్యావరణ హిత..
సెల్ఫీ విత్ గణేష్



సాక్షి, ఆసిఫాబాద్: పర్యావరణాన్ని కాపాడే రీతిలో, విభిన్న ఆకృతుల్లో అపార్ట్‌మెంట్లు, యువజన సంఘాలు, ఇళ్లలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గణేషులకు సంబంధించి 'సాక్షి' పర్యావరణ హిత.. సెల్ఫీ విత్ గణేష్ పేరిట ఫొటోలను ఆహ్వానిస్తోంది. వినాయక ప్రతిమలతో తీసుకున్న సెల్ఫీ ఫొటోలను బుధవారం సాయంత్రం 4గంటల వరకు **97053 48179** నంబరుకు వాట్సాప్‌లో పంపించాలి.

గణేష్ మండలి పేరు,
ఇంట్లో అయితే మీ పేరు, గ్రామం,
మండలం వివరాలు పంపించాలి.



పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

దండాలయ్యా.. ఉండ్రాలయ్యా



రెబ్బెన: దుబ్బగూడలో విఘ్నేశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు



ద్వారకానగర్‌లో మొక్కజొన్న కంకులతో రూపుదిద్దుకున్న గణనాథుడు



జిల్లా కేంద్రంలోని బాపూనగర్ గణేశ్ మండలి వద్ద..



కాపువాడలో పల్లికాయలతో వినాయకుడు

విద్యుత్ వెలుగులు.. ఆకట్టుకునే అలంకరణలతో ఏర్పాటు చేసిన మండపాల్లో బొజ్జ గణపయ్య కొలువుదీరాడు. నవరాత్రుల్లో భాగంగా సోమవారం తీరొక్క పూలు, పండ్లు, పత్రులతో తొలిపూజలు అందుకున్నాడు. వినాయక చవితిని పురస్కరించుకుని జిల్లా కేంద్రం, కాగజ్‌నగర్‌తోపాటు పల్లెల్లో భక్తులు వివిధ ఆకృతుల్లో ఏకదంతుడిని ప్రతిష్ఠించుకుని ప్రత్యేక పూజలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన గణేషుడికి కుటుంబ సభ్యులతో కలిసి పూజలు నిర్వహించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడలో శ్రీసాయి గణేష్ మండలి ఆధ్వర్యంలో పల్లికాయలతో ఏర్పాటు చేసిన వినాయకుడు ఆకట్టుకున్నాడు. ద్వారకానగర్‌లోని యువజన గణేష్ మండలి ఆధ్వర్యంలో మొక్కజొన్న కంకులతో విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.

- ఆసిఫాబాద్/కాగజ్‌నగర్‌రూరల్

న్యూస్‌రీల్

కానిస్టేబుల్‌కు అభినందన



గోపిని అభినందిస్తున్న ఎస్పీ సురేశ్‌కుమార్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభ చూపిన కానిస్టేబుల్ గోపిని మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ సురేశ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా పోలీస్ స్పెషల్ పార్టీ విభాగానికి చెందిన పొట్ట గోపి పంజాబ్‌లో ఇటీవల నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో సెపక్ టక్ర క్రీడలో పాల్గొని రెండు కాంస్య పతకాలు సాధించాడు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. అడ్మిన్ ఆర్‌ఐ పెద్దన్న, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతరాయం లేకుండా సేవలు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతరాయం లేకుండా సేవలందిస్తున్నట్లు జిల్లా స్త్రీశిశు సంక్షేమశాఖ అధికారి సావిత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 973 అంగన్‌వాడీ కేంద్రాల్లో 80 శాతం మంది ఉద్యోగులు సమ్మెలో ఉన్నా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయ సంఘాలు, వలంటీర్ల సాయంతో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

పంటలను ముంచెత్తిన 'ప్రాణహిత'



మురళీగూడ సమీపంలో నీట మునిగిన పత్తి

పెంచికల్‌పేట్(సిర్పూర్): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో ప్రాణహిత నదికి వరద పోటెత్తింది. పెంచికల్‌పేట్ మండలం మురళీగూడ, జిల్లెడలోని పంటలు నీట మునిగాయి. రెండు రోజులుగా నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పరీవాహక ప్రాంతాల్లో పత్తి, కంది చేలను వరద ముంచెత్తింది. సుమారు 70 ఎకరాల్లో పంటలు నీట మునిగాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు.

అమర వీరులను స్మరించుకోవాలి



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

చింతలమానెపల్లి(సిర్పూర్): దేశ నిర్మాణంలో ప్రాణాలర్పించిన అమరవీరులను స్మరించుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని రుద్రాపూర్‌లో మంగళవారం మన మట్టి- మన దేశం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. నాయకులు శ్రీశైలం, శ్యాంరావు, తిరుపతిగౌడ్, మల్లయ్య పాల్గొన్నారు.

హస్తంలో అయోమయం!

- డీసీసీ అధ్యక్షుడికి అనారోగ్యం
- గుండెకు స్టంట్.. హైదరాబాద్‌లో విశ్రాంతి
- పార్టీ పగ్గాలు చేపట్టేందుకు ప్రేంసాగర్ సన్నాహాలు
- జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్ వర్గీయుల్లో గందరగోళం
- ఆసిఫాబాద్ నియోజకవర్గంలో ఎవరికి వారే అన్నట్లుగా ఆశావహుల ప్రచారం



జిల్లా కేంద్రంలో రోడ్‌షో నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాక్షి, ఆసిఫాబాద్: జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో అయోమయ పరిస్థితులు ఏర్పడ్డాయి. కొక్కిరాల బ్రదర్స్ రెండు వర్గాలుగా విడిపోయి ఈ గందరగోళానికి కారణమయ్యారు. దీనికితోడు ఆసిఫాబాద్ నియోజకవర్గ ఆశావహులు గణేష్ రాథోడ్, అజ్మీరా శ్యాంనాయక్, మర్సుకోల సరస్వతి మధ్య టికెట్ పోరుతోపాటు ముగ్గురు ఎవరికి వారే ప్రచారాలు నిర్వహిస్తుండటం చర్చనీయాంశమైంది. ఇక డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ అనారోగ్యం బారిన పడటంతో పెద్దదిక్కు లేకుండా పోయింది. హైదరాబాద్‌లో పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు పరీక్షించి ఆయన గుండెకు స్టెంట్ వేశారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇదే తరుణంలో ఇన్నాళ్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న మాజీ ఎమ్మెల్సీ, కాంగ్రెస్ ఎన్నికల వ్యూహ కమిటీ చైర్మన్ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు జిల్లా పార్టీ పగ్గాలు తన గుప్పిట్లోకి తెచ్చుకునేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

కాంగ్రెస్‌పై 'కొక్కిరాల' పట్టు

అది నుంచి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్‌లో మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకి తనదైన అనుచర వర్గం ఉంది. ఈ నేపథ్యంలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్, సిర్పూర్, బోథ్ నియోజకవర్గాల్లో తన అనుచరులకే టికెట్ ఇప్పించుకునే ప్రయత్నాల్లో నిమగ్నమై ఉన్నారు. అయితే ఆసిఫాబాద్ నియోజకవర్గం(ఎస్టీ) టికెట్‌కు కేటాయింపు వ్యవహారంలో ప్రేంసాగర్‌రావుకి, ఆయన సోదరుడు విశ్వప్రసాద్‌రావు మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తాయి. అదే సమయంలో జిల్లాపై తన పట్టును సడలించకూడదన్న భావనతో ఉన్న మాజీ ఎమ్మెల్సీ పైచేయి సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కష్టకాలంలో ఉన్న సమయంలో పార్టీకి అండగా నిలిచి.. నాలుగున్నరేళ్లుగా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న గణేష్ రాథోడ్‌కి టికెట్ ఇవ్వాలంటూ అధిష్టానంపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం అనారోగ్యంతో విశ్రాంతి తీసుకుంటున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు సైతం అధిష్టానం వద్ద తాను బలపరుస్తున్న ఆశావహుల విజయావకాశాలపై నివేదిక అందించినట్లు తెలుస్తోంది. ఒకవేళ గణేష్ రాథోడ్‌కి పార్టీ టికెట్ ఇస్తే గణనీయమైన ఓట్లు కలిగిన ఓ సామాజిక వర్గం దూరమవుతుందని పేర్కొన్నట్లు సమాచారం. అయితే ప్రేంసాగర్‌రావు మాత్రం పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కాకుండా ప్యారాషూట్‌లో దిగిన, ఏడాది కిందట పార్టీలో చేరిన వారికి టికెట్లు ఇస్తే విజయావకాశాలు సన్నగిల్లుతాయని అధిష్టానానికి సూచినట్లు తెలిసింది. డీసీసీ అధ్యక్షుడికి ఇప్పటికే రెండు సార్లు స్టంట్లు వేయడంతో ఆయన ఆరోగ్యంపై కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. పైగా రిజర్వుడ్ నియోజకవర్గంలో పార్టీ కోసం ఎంత శ్రమించినా తగిన గుర్తింపు లభించదు కాబట్టి.. ఆయనను విశ్రాంతి తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఒత్తిడి తెస్తున్నారని, ప్రచారానికి సైతం వెళ్లొద్దంటున్నట్లు సమాచారం. ప్రేంసాగర్‌రావు సైతం అదే అభిప్రాయం ఉన్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో తమ్ముడి ఆరోగ్యం కుదుట పడేవరకు అన్నీతానై పార్టీని నడిపించాలనే నిర్ణయానికి వచ్చి అధిష్టానం వద్ద తన ప్రతిపాదనను ఉంచినట్లు సమాచారం.

ఎవరికి వారే యమునా తీరే!

ఆసిఫాబాద్ నియెజకవర్గ టికెట్ కోసం పది మంది దరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యంగా ప్రేంసాగర్‌రావు మద్దతుదారుడు గణేష్ రాథోడ్, విశ్వప్రసాద్‌రావు మద్దతుదారుడు అజ్మీరా శ్యాంనాయక్‌తోపాటు ఆసిఫాబాద్ మాజీ సర్పంచ్ మర్సుకోల సరస్వతి, పారిశ్రామికవేత్త రాథోడ్ శేషారావు టికెట్ కోసం పోటీపడుతున్నారు. వీరిలో శ్యాంనాయక్, గణేష్ రాథోడ్, సరస్వతి ఎవరికి వారు పోటా పోటీగా మండలాల్లో పర్యటనలు చేస్తున్నారు. తమకే టికెట్ వస్తుందనే ధీమాను కార్యకర్తల వద్ద వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి పరిణామాలను సూక్ష్మదృష్టితో పరిశీలిస్తున్న అధిష్టానం అభ్యర్థుల విజయావకాశాలపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిసింది.

కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేయాలి

ఆసిఫాబాద్: కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కలిసికట్టుగా కృషి చేయాలని సీడబ్ల్యూసీ సభ్యురాలు యశోదారాణి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రేమల గార్డెన్‌లో సోమవారం నిర్వహించిన సీడబ్ల్యూసీ సమావేశానికి హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమన్నారు. అంతకు ముందు జిల్లా కేంద్రంలో మోటార్ బైక్ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గణేష్ రాథోడ్, మర్సుకోల సరస్వతి, శ్యాంనాయక్, కేశవరావు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోనప్ప, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్

కాగజ్‌నగర్‌రూరల్: అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. పులిదాడిలో మృత్యువాత పడిన పశువులకు సంబంధించిన పరిహారం చెక్కులను మంగళవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యజమానులకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని అడవులను సంరక్షించుకోవడంతోపాటు వన్యప్రాణులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాగజ్‌నగర్ మండలంలోని 19 మందికి రూ.3.33 లక్షలు, బెజ్జూర్ మండలంలో 12 మందికి రూ.22.9 లక్షలు, పెంచికల్‌పేట్ మండలంలో 15 మందికి రూ.2.27 లక్షలు, సిర్పూర్(టి) మండలంలో తొమ్మిది మందికి రూ.1.59లక్షల విలువైన చెక్కులు అందజేశారు.

చర్చలతో సమస్యలు పరిష్కరించుకోవాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



మాట్లాడుతున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్‌అర్బన్: చర్చలతో సామరస్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం, రవాణాశాఖ అధికారులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్పీఎం యాజమాన్యం, ట్రాన్స్‌పోర్టర్లు సమస్యలపై చర్చించుకుని, పరిష్కార మార్గాలతో ముందుకు రావాలని సూచించారు. సమావేశంలో జిల్లా రవాణాశాఖ అధికారి లక్ష్మి, మిల్లు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు పెంచాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం వైద్యారోగ్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని గర్భిణులు తమ వివరాలు ఆస్పత్రుల్లో నమోదు చేసుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. హైరిస్క్ కేసుల వివరాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో పోషకాహారం అందించాలని సూచించారు. వైద్యారోగ్యశాఖ, స్త్రీశిశు సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డీఎంహెచ్‌వో తుకారాం, శిశుసంక్షేమ శాఖ జిల్లా అధికారి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ నెల 19తో ఓటరు నమోదు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసిందన్నారు. అభ్యంతరాలపై సమగ్ర విచారణ చేపట్టి ఈ నెల 28న పూర్తిస్థాయి నివేదిక రూపొందించాలన్నారు.

'ఆమె'దే పైచేయి..!

- ఉమ్మడి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో వారి ఓట్లే అధికం
- పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని మూడింట్లో పురుషులు కాస్త ఎక్కువ
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర కేబినెట్ తీర్మానం
- కీలకంగా మారనున్న మహిళా ఓటర్లు



ఓటర్ల పరిస్థితిని పరిశీలిస్తే..

సాక్షి, ఆదిలాబాద్: చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో కేంద్ర కేబినెట్ సోమవారం తీర్మానం చేసిన నేపథ్యంలో అంతటా దీనిపైనే చర్చ జరుగుతోంది. నూతన పార్లమెంట్ భవనంలో ఈ చారిత్రక బిల్లును మంగళవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వల్ ప్రవేశపెట్టారు. దీనిపై చర్చల అనంతరం చట్టం కార్యరూపం దాల్చేది స్పష్టమవుతుంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలోకి వచ్చే అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళా

ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో..

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో సిర్పూర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముథోల్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ లోకసభ పరిధిలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. అత్యధికంగా నిర్మల్ నియోజకవర్గంలో మహిళా ఓటర్లుండగా, ఆ తర్వాత ముథోల్, ఆదిలాబాద్, ఖానాపూర్, బోథ్‌లో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు.

పెద్దపల్లి పరిధిలో..

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి మంచిర్యాలతో పాటు జగిత్యాల జిల్లాలోని ధర్మపురి, పెద్దపల్లి జిల్లాలోని రామగుండం, మంథని, పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలు వస్తాయి. ఈ లోకసభ పరిధిలోనూ పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. అయితే స్వల్పంగా వంద ఓట్ల తేడా మాత్రమే ఉండటం గమనార్హం. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే.. మంథని, పెద్దపల్లి, ధర్మపురిలో మహిళా ఓటర్లు అధికంగా ఉండగా, చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుష ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పురుష ఓటర్లు 7,41,238 మంది ఉండగా, మహిళా ఓటర్లు 7,41,368 మంది ఉన్నారు.

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ ఓటర్ల వివరాలు..

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
సిర్పూర్	1,09,349	1,07,902	09	2,17,260
ఆసిఫాబాద్	1,07,128	1,06,847	16	2,13,991
ఆదిలాబాద్	1,12,888	1,16,120	07	2,29,015
బోథ్	1,00,052	1,04,421	03	2,04,476
ఖానాపూర్	1,03,222	1,06,490	13	2,09,725
నిర్మల్	1,12,612	1,24,706	14	2,37,332
ముథోల్	1,15,000	1,20,840	18	2,35,858
మొత్తం	**7,60,251**	**7,87,326**	**80**	**15,47,657**



పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోకి వచ్చే ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల ఓటర్లు

అసెంబ్లీ	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
చెన్నూర్	89,176	88,443	09	1,77,628
బెల్లంపల్లి	81,345	80,550	13	1,61,908
మంచిర్యాల	1,25,609	1,24,829	20	2,50,458



బిల్లు ఆమోదం పొందితే..

మహిళా రిజర్వేషన్లకు సంబంధించి బిల్లు ఆమోదం పొందితే దేశ వ్యాప్తంగా లోకసభ, అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళలకు 33 శాతం చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కుతుంది. మహిళా జనాభాకు అనుగుణంగా నియోజకవర్గాలను రిజర్వ్ చేస్తారు. ప్రస్తుతం మహిళా ఓటర్ల సంఖ్యపై జోరుగా చర్చ సాగుతోంది. అలాగే ఉమ్మ డి ఆదిలాబాద్ జిల్లాలో ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ ఉండగా, ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు చెన్నూర్, బెల్లంపల్లి ఉన్నాయి. మిగతా నియోజకవర్గాలు జనరల్‌గా ఉన్నాయి. ఈ రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లోనూ మహిళా జనాభా ప్రకారం రిజర్వేషన్లు కేటాయిస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లోనూ మహిళా ఓటర్ల నిష్పత్తిపై కూడా సమీకరణాలు మొదలయ్యాయి.

క్లుప్తంగా

రేషన్‌బియ్యం పట్టివేత



పోలీసులు పట్టుకున్న వాహనం

కాసిపేట: అక్రమంగా వాహనంలో తరలిస్తున్న 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం ముత్యంపల్లిలో పట్టుకున్నట్లు ఎస్సై గంగారాం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేయగా బియ్యం లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. మందమర్రికి చెందిన దుదాని బదల్‌సింగ్ ముత్యంపల్లికి చెందిన దుర్గం శంకర్ వద్ద కొనుగోలు చేసి తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి వాహనం, బియ్యం స్వాధీనం చేసుకుని రెవెన్యూ అధికారులకు మంగళవారం అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇరువురిపై అట్రాసిటీ కేసు

జన్నారం: కులం పేరుతో దూషించి, బెదిరించిన వ్యక్తులపై మంగళవారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఈ నెల 13న జన్నారం మండలం రేండ్లగూడ గ్రామానికి చెందిన మురిమడుగుల దస్తగిరిని అదే గ్రామానికి చెందిన బాల్తా రాజమౌళి, బాల్తా సంతోష్ కులం పేరుతో దూషించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరిపి ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అంగన్ వాడీ టీచర్‌కు గాయాలు

నెన్నెల: మండలంలోని ఖర్జీ గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ కోట శకుంతలకు సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలయ్యాయి. తోటి ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం...శకుంతల మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న నిరవధిక సమ్మెలో పాల్గొనడానికి ఖర్జీ నుంచి నెన్నెలకు ఆటోలో వస్తుండగా మన్నెగూడం సమీపంలో కుక్క అడ్డు రావడంతో ఆటో డ్రైవర్ సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో ముందుసీట్లో కూర్చున్న శకుంతల కిందపడడంతో గాయాలయ్యాయి. నెన్నెల పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

నలుగురిపై కేసు నమోదు

బెల్లంపల్లి: పేకాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. సోమవారం తమకు అందిన సమాచారంతో కన్నాల బస్తీ పార్క్ పక్కనున్న ఓ పాత భవనంలో దాడి చేసి పేకాట ఆడుతున్న దుర్గం రాజ్‌కుమార్, కొమ్మెర చక్రపాణి, బొడ్డుల రాజయ్య, తోటపల్లి విక్రమ్‌లను పట్టుకుని వారి వద్ద నుంచి రూ.14,340 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఒర్రెలోపడి వ్యక్తి మృతి

ఆసిఫాబాద్‌అర్బన్: పట్టణంలోని జన్కాపూర్‌కు చెందిన జె.అశోక్ (52) సమీపంలోని ఒర్రెలో పడి మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జన్కాపూర్‌కు చెందిన అశోక్ కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోవడంతో పాటు మూర్ఛవ్యాధితో బాధపడుతున్నాడు. సోమవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం జన్కాపూర్ శివారులోని ఒర్రెలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాజేశ్వర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడు నిత్యం బహిర్భూమికి, స్నానానికి ఒర్రెకు వెళ్తా ఉండేవాడని, ఒర్రెలో స్నానం చేస్తుండగా మూర్ఛ వచ్చి నీటిలో మునిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మృతుని భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో బాలింత మృతి



మానస (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): నవ మాసాలు మోసి పండంటి బిడ్డకు జన్మనిచ్చిన ఆతల్లి బిడ్డను కళ్లారా చూడక ముందే కానరాని లోకాలకు వెళ్లిపోయింది. మండల కేంద్రానికి చెందిన గొడిసెల మానస (24)కు రెండు రోజుల క్రితం పురిటినొప్పులు ప్రారంభం కాగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. సోమవారం పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చిన మానసకు తెల్ల రక్తకణాలు తక్కువగా ఉన్నాయని హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మృతి చెందినట్లు భర్త సాయికిరణ్‌గౌడ్ తెలిపారు. చంటిబిడ్డతో ఇంటికి వస్తుందనుకున్న ఆ తల్లి మృతి చెందడంతో రెబ్బెనలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

21న జాబ్‌మేళా

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి కౌశిక వెంకటరమణ తెలిపారు. వైర్ వాల్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్‌కు చెందిన కంపెనీలో జూనియర్ ఫెన్సింగ్ టెక్నీషియన్ పోస్టులు 15 ఖాళీగా ఉన్నాయని, ఐటీఐ ఫిట్టర్ ట్రేడ్‌లో ఉత్తీర్ణులై 20 నుంచి 27 సంవత్సరాల మధ్య వయస్సు కలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సీజన్‌కు ముందే సీతాఫలం!

- ఈ ఏడాది ముందుగానే మార్కెట్‌లోకి పండ్లు
- ఒక్కో పండు ధర రూ.30 నుంచి రూ.40
- చిన్నాపెద్ద తేడా లేకుండా ఇష్టంగా తినేఫలం
- అల్పాహారంగా తీసుకుంటే ఆరోగ్యానికి రక్ష



ఐబీచౌరస్తాలో అమ్మకానికి వచ్చిన సీతాఫలాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: సామాన్యుడి నుంచి సంపన్నుల వరకు ఇష్టపడే పండు సీతాఫలం. ఏటా శీతాకాలం ప్రారంభం నుంచే సీతాఫలాలు మార్కెట్లోకి వచ్చేస్తాయి. కానీ ఈ ఏడాది శీతాకాలానికి ముందుగానే మంచిర్యాల మార్కెట్‌లోకి వచ్చేశాయి. అత్యంత తియ్యని రుచి కలిగిన ఈ పండ్లలో ఎన్నోరకాల పోషకాలు ఉన్నాయి. నాలుగైదు రోజులుగా జిల్లాలోని వివిధ మండలాలతో పాటు కరీంనగర్, జగిత్యాల జిల్లాల నుంచి సీతాఫలాలు మంచిర్యాల పట్టణానికి వస్తున్నాయి.

జోరుగా విక్రయాలు..

ఈ ఏడాది భారీ వర్షాలు కురియడంతో సీతాఫలాల దిగుబడి ముందుగానే వచ్చింది. నాలుగు రోజులుగా మంచిర్యాల ఐబీ చౌరస్తాలో అమ్మకాలు సాగిస్తున్నారు. పేదల ఆపిల్‌గా పేరొందిన సీతాఫలాలకు మార్కెట్లో మంచి గిరాకీ లభిస్తుంది. ఒక్కో పండుకు రూ.30 నుంచి రూ.40 వరకు ధర పలుకుతోంది. కాయలైతే రూ. 10 నుంచి రూ.15 వరకు అమ్ముతున్నారు. కాయలను గంపగుత్తన రూ. 600 నుంచి రూ.700 వరకు విక్రయిస్తున్నారు. ఈ పండ్లలో పోషకాలు ఉంటాయని నిపుణులు సూచిస్తుండడంతో ధర ఎక్కువైనా కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి కొంత మంది మహిళలు పట్టణ ప్రాంతాలకు సీతాఫలాలను తీసుకవచ్చి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. రోజుకు రూ.600 నుంచి రూ.700 వరకు ఆదాయం పొందుతున్నారు.

రోగనిరోధక శక్తి పెరుగుదల

సీతాఫలం పండ్లలో ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఈ పండ్లలో విటమిన్ (ఏ), మెగ్నీషియం, పోటాషియం, ఫైబర్ విటమిన్–బీ6, క్యాల్షియం, విటమిన్–సీ, ఐరన్ వంటి అత్యంత ముఖ్యమైన పోషకాలు ఉన్నాయని వైద్యులు పేర్కొంటున్నారు. ఉదయాన్నే అల్పాహారంగా సీతాఫలాలు తీసుకుంటే కండరాలు, నరాల బలహీనత తొలగుతాయి. శరీరానికి కావాల్సినంత శక్తి లభిస్తుంది. విటమిన్–ఏ ఎక్కువగా ఉండడం వల్ల దృష్టి సమస్యలు దూరమవుతాయి. పండ్లలో మెగ్నీషియం, సోడియం, పొటాషియం సమపాల్లలో ఉండడం వల్ల బీపీని కంట్రోల్ చేసి గుండెజబ్బులు రాకుండా చూస్తాయి. వీటిలో ఉండే పోషకాలు శరీరంలో పేరుకు పోయిన కొవ్వును కరిగిస్తాయి. అల్సర్, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి జీర్ణ సంబంధ సమస్యలు తగ్గుతాయి. గర్భిణులు ఈ పండ్లను తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ మెదడు చురుకుగా పనిచేస్తుంది. క్యాన్సర్ నిరోధకానికి కూడా ఈ ఫలాలు తోడ్పడుతాయని వైద్యనిపుణులు పేర్కొంటున్నారు.

ఆరంభంలో ధరలు ఎక్కువే..

సీతాఫలాల ధరలు ఈ ఏడాది ఒకింత ఎక్కువగానే ఉన్నాయి. ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి వస్తుండడంతో ధర అధికంగానే పలుకుతోంది. అక్టోబర్ మాసం చివరిలో లేదా నవంబర్ మొదటి వారం నుంచి మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చే పండ్లు ఈ ఏడాది నెల రోజులు ముందుగానే వచ్చాయి. గతేడాది నవంబర్‌లో సీతాఫలాలు నాణ్యత సైజును బట్టి డజనుకు రూ.100 నుంచి రూ. 150 మధ్య లభించగా ఈ ఏడాది డజన్ ధర రూ.300 వరకు పలుకుతోంది. అయినా ప్రకృతి సీజన్ పోషకాల పండ్లు కావడంతో కొనక తప్పడంలేదు.

ఆదివాసీ గూడేల్లో జ్వరాల విజృంభణ

- తల్లడిల్లుతున్న గిరిజన గ్రామాలు



జ్వరంతో బాధపడుతున్న కొమ్ముల మల్లేశ్

కాసిపేట: మండలంలోని ఆదివాసీ గూడేల్లోని ప్రజలు జ్వరాలతో తల్లడిల్లుతున్నారు. దేవాపూర్ నాయకపుగూడలో భైర్నేని మల్లక్క, కొమ్ముల భీమయ్య, కొమ్ముల పోషయ్య, మల్లేశ్, కీర్తన, బద్ది నవీన్, కోలకాని లక్ష్మి డెంగీతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కొందరు స్థానికంగా ఆర్‌ఎంపీలు, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తుండగా ఆర్థికంగా స్థోమతలేనివారు ఇంటివద్దే ఉండి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్యాధికా రులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు రెండు నెలలుగా ఇటు చూసిన పాపాన పోలేదని వాపోతున్నారు.



జ్వరంతో బాధపడుతున్న కొమ్ముల పోచయ్య

జ్వరంతో యువకుడు మృతి

మండలంలోని సోనాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దొడ్డిగూడకు చెందిన కుడిమేత జలపతి (14) జ్వరంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. యువకుడు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు.

వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలి

ఆదివాసీ గూడేల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదివాసీ నాయక్‌పోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కొమ్ముల బాపు, నాయకులు కన్నక మాన్కు డిమాండ్ చేశారు.

మరణంలోనూ వీడని బంధం

- రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములు మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు
- కుమురంభీం జిల్లా దహెగాంలో విషాదం



నాగుల తిరుపతి, నాగేశ్ (ఫైల్)

వాంకిడి/దహెగాం: ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములిద్దరినీ రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. వాంకిడి మండలంలోని గణేశ్‌పూర్ గ్రామ శివారులో నాలుగు వరుసల జాతీయ రహదారి–363పై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నదమ్ములిద్దరూ మృతి చెందారు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. కుమురం భీం జిల్లా దహెగాం మండల కేంద్రానికి చెందిన నాగుల తిరుపతి(52), పార్వతి దంపతులతో నాగుల నాగేష్ (42) ఉదయం కారులో మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో ఉన్న బంధువుల ఇంట్లో జరిగిన కార్యక్రమానికి వెళ్లారు. సాయంత్రం తిరుగుప్రయాణంలో గణేష్‌పూర్ గ్రామ సమీపంలో ఆసిఫాబాద్ వైపు నుంచి చంద్రపూర్ వైపు వెళ్తున్న లారీ ఎదురుగా వచ్చి కారును ఢీకొట్టింది. ఘటనలో నాగేష్ అక్కడికక్కడే మృతి చెందగా తిరుపతిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. పార్వతికి తీవ్రగాయాలు కావడంతో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ తోట వీరబాబును అదుపులోకి తీసుకున్నారు. మృతుడు నాగేష్ కుమారుడు నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పోరాటాలతోనే కాంట్రాక్టు కార్మికులకు హక్కులు



మాట్లాడుతున్న ఎండీ అక్బర్ అలీ

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు పోరాటాల ద్వారానే హక్కులు సాధించబడుతాయని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎండీ అక్బర్ అలీ అన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ, గోలేటి నర్సరీలలో మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోలిండియాలో అమలవుతున్న హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలోనూ అమలు చేయాలని, జీవో 22 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని, గతేడాది సెప్టెంబర్ 9 నుండి 26 వరకు చేపట్టిన సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. 25న కొత్తగూడెం లోని ప్రధాన కార్యాలయం ముట్టడికి అధికసంఖ్యలో కాంట్రాక్టు కార్మికులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు బయ్యా మొగిళి, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి అశోక్, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు దేవ సహాయం, శంకర్, ఖాథర్, సురేష్, భీంరావు, తిరుపతి పాల్గొన్నారు.

అధికారులపై కఠినచర్యలు తీసుకోవాలి



ధర్నా చేస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా ఎస్అండ్‌పీసీ విభాగంలో జమేదార్‌గా పనిచేస్తున్న పొట్ట శ్రీనివాస్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్న అధికారులపై యాజమాన్యం కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు డిమాండ్ చేశారు. మంగళవారం గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించిన అనంతరం డీవైపీఎం తిరుపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీనివాస్‌ను ఆర్జీ–1 ఏరియాకు బదిలీ చేయాల్సి ఉండగా కావాలనే అధికారులు విచారణ చేపట్టకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. జూనియర్ ఇన్‌స్పెక్టర్ చంద్రయ్యతో పాటు మరికొంత మంది అధికారులు కక్ష సాధింపు చర్యలు చేపట్టడంతో తీవ్ర మానసిక క్షోభకు గురైన శ్రీనివాస్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో మృత్యువుతో పోరాడుతున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి కార్యదర్శి శివారెడ్డి, ఏరియా కార్యదర్శి ఇనూస్, పిట్ కార్యదర్శి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులు సమ్మెకు సిద్ధంగా ఉండాలి'



మాట్లాడుతున్న శంకర్‌రావు

నస్పూర్: 11వ వేజ్‌బోర్డు వేతనాలకు సంబంధించి డీపీఈ గైడ్‌లైన్స్‌పై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్య పరిష్కరించాలని, లేనిపక్షంలో అక్టోబర్ 5, 6, 7 తేదీలలో దేశవ్యాప్త సమ్మెకు సింగరేణి కార్మికులు సిద్ధంగా ఉండాలని ఐఎన్టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు పేర్కొన్నారు. మంగళవారం శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే 6 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణి ఎన్నికలలో తమ యూనియన్‌ను గెలిపిస్తే పెన్షన్ పెంపు గ్రాడ్యుటీపై సీలింగ్ ఎత్తివేయడం, సొంతింటి పథకం, డిపెండెంట్‌ల వయస్సు పెంపు వంటి తదితర హామీలు నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీంరావు, గరిగ స్వామి, సమ్ము రాజయ్య, వెంకటేశ్వర్లు, రాంచందర్, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న మహిళా ఉద్యోగులు

నస్పూర్: ఎమ్మెల్సీ కవిత పోరాటం వల్లే చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం తీసుకుందని టీబీజీకేఎస్ నాయకులు పేర్కొన్నారు. మంగళవారం జీఎం కార్యాలయ, వర్క్‌షాప్ మహిళా కార్మికులు కవిత చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళలకు చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ ఏడాది మార్చి 10న జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేశారని, అన్నిపార్టీల ఎంపీలకు లేఖలు రాసారన్నారు. ఈ కార్యక్రమంలో జీఎం కార్యాలయ టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి ఆకుల అఖిల, ఉద్యోగులు రజిత, కళ్యాణి, నాగలక్ష్మి, సబితారెడ్డి, మమత, సుమలత, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు కే.సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హత్యకేసులో ముగ్గురు అరెస్టు

కాగజ్‌నగర్‌రూరల్: మంచిర్యాల జిల్లా భీమిని మండలంలోని చిన్నగుడిపేటకు చెందిన ముదిగిరి బీరయ్య (45) హత్య కేసులో ముగ్గురిని మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఈజ్‌గాం ఎస్సై రామన్ కుమార్ తెలిపారు. ఈనెల 17న మండలంలోని ఆరెగూడ శివారులోని మామిడిచెరువులో బీరయ్య అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. మృతుని భార్య దేవక్క, బావమరిది పర్వతాలు, మామ శంకర్‌ను విచారించగా తామే హత్య చేసినట్లు అంగీకరించారు. మృతుడు నిత్యం మద్యం సేవించి ఇంటికివచ్చి గొడవపడుతుండేవాడని, ఈ నెల 16న కూడా రాత్రి తాగివచ్చి ఇంట్లో గొడవ పడడంతో విసుగుచెంది మెడకు తాడు బిగించి హత్యచేసి మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లి చెరువులో పడవేసినట్లు అంగీకరించారని ఎస్సై పేర్కొన్నారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య

వాంకిడి(ఆసిఫాబాద్): పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలంలో చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన బొందు బాయి(52) వ్యవసాయ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. ఆ తర్వాత బయటికి వెళ్లిన బొందుబాయి కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చి వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందింది. ఎస్సై సాగర్‌ను సంప్రదించగా ఘటనపై ఫిర్యాదు అందలేదని, ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

జాబితాపై అభ్యంతరాలు తెలపాలి

మంచిర్యాలటౌన్: తెలంగాణ వైద్య విధాన పరిషత్, జిల్లా ఆస్పత్రుల ప్రధాన అధికారి కార్యాలయ పరిధిలో ఒప్పంద, పొరుగు సేవల పద్ధతిలో అందిన దరఖాస్తులను పరిశీలించి కార్యాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించిన ప్రాథమిక మెరిట్ జాబితాపై అభ్యంతరాలుంటే ఈ నెల 20 నుంచి 25 వరకు తెలియజేయాలని జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకులు డాక్టర్ అరవింద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యంతరాలను రాతపూర్వకంగానే తెలియజేయాలని సూచించారు. ఒప్పంద పద్ధతిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు, సివిల్ అసిస్టెంట్ సర్జన్, పొరుగు సేవల పద్ధతిలో సిటీస్కాన్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు గ్రేడ్ 2, థియేటర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరినట్లు తెలిపారు.

ఈత చెట్టు పైనుంచి కిందపడి ఒకరికి గాయాలు

బెల్లంపల్లిరూరల్: ప్రమాదవశాత్తు ఈతచెట్టు పైనుంచి కిందపడి గీత కార్మికుడు గాయాలపాలైన సంఘటన మండలంలోని తాళ్లగురిజాలలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రంగు రాజశేఖర్ గౌడ్ మంగళవారం గ్రామ శివారులోని ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా జారి కిందపడ్డాడు. బలమైన గాయాలుకావడంతో స్థానికులు గమనించి బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేయ్.. ముక్కేయ్ !

- ఇళ్లలోనే పేకాట ఆడేందుకు సౌకర్యాలు
- టీచర్లు, ఉన్నతాధికారులు వ్యసనపరులే
- వాట్సాప్‌లో పేకాట వీడియో చక్కర్లు



పేకాడుతున్న ఓ టీచరు, జిల్లాలోని మిషన్ భగీరథ ఉన్నతాధికారి

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జిల్లాలో నిషేధిత పేకాట ఆగడం లేదు. జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో రహస్యంగా ఇంకా పేకాట స్థావరాలు నడుస్తున్నాయి. ఇందులో ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగులు తమ బాధ్యత మరచి యథేచ్ఛగా పేకాట ఆడుతున్నారు. జిల్లా కేంద్రంలో వారం క్రితం రహస్యంగా సాగుతున్న పేకాటను ఎవరో సెల్‌ఫోన్‌లో వీడియో తీయడంతో వారి బండారం బయటపడింది. మంగళవారం వాట్సాప్ గ్రూపులో చక్కర్లు కొట్టింది. ఆ వీడియోలో కోటపల్లి హైస్కూల్‌లో పని చేస్తున్న ఓ ప్రధానోపాధ్యయుడు, మరో స్కూల్ ఓ టీచర్, జిల్లా మిషన్ భగీరథ జిల్లా ఉన్నతాధికారి ఉన్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. వీరితోపాటు మరికొందరు టీచర్లు, ఉద్యోగులు ఉన్నారు. ఓ టీచరు పేక ముక్కలు టేబుల్‌పై వేస్తుండగా, మరికొందరు చేతిలో మద్యం గ్లాసుతో కుర్చీల్లో కూర్చొన్నారు. తెలంగాణ వచ్చాక ప్రభుత్వం పేకాట పూర్తిగా నిషేధించింది తెలిసిందే. ఎక్కడైనా, ఎవరైనా ఆడినట్లు కనిపిస్తే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో మహారాష్ట్రకు వెళ్లి క్లబ్బుల్లో ఆడేవారు. అప్పుడప్పుడు అడవులు, వ్యవసాయ క్షేత్రాల్లోనూ పట్టుబడుతున్నారు. అన్ని చోట్ల నిఘా ఉందని తెలిసి కొందరు ఇళ్లనే క్లబ్బులుగా మార్చేస్తున్నారు. పేకాట అలవాటు ఉన్న వారిని రప్పించి ఆడిస్తున్నారు. ప్రతీ ఆటకు కొంత కమీషన్‌ను వసూలు చేస్తున్నారు. ఆడేవారికి మందు, భోజనం, ఏసీతో కూడిన గది సౌకర్యం కల్పిస్తున్నారు. ఆదివారం, సెలవు దినాల్లో ఎక్కువగా నడుస్తోంది. కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు కూడా నిషేధ ఆట ఆడడం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వీరిపై ఆయా శాఖల ఉన్నతాధికారులు, ఇటు పోలీసు వర్గాలు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

జాతీయస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో ఈ నెల 14 నుంచి 19 వరకు జరిగిన సబ్ జూనియర్ అండర్–17 నేషనల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పాల్గొన్నారు. బాలికల డబుల్స్ విభాగంలో అనుమలు శ్రీవల్లి, బాలుర డబుల్స్ విభాగంలో శ్రీఆదిత్య హర్షవర్ధన్ పోటీల్లో పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు, పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, అడ్వైజర్, మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేశ్ గౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ల వాసు, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి అభినందించారు.

అటవీ ప్రాంతంలో పోలీసుల తనిఖీలు



బాంబ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

కోటపల్లి: మావోయిస్టుల వారోత్సవాల సందర్భంగా మండలంలోని నాగంపేట, బొప్పారం అటవీ ప్రాంతంలో మంగళవారం పోలీసులు బాంబ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో స్పెషల్ పార్టీ, బాంబ్‌స్క్వాడ్ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

సీఎంపీఎఫ్ ట్రస్ట్‌బోర్డు సభ్యుల నియామకం

నస్పూర్: కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ (సీఎంపీఎఫ్) ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా బీఎంఎస్ నాయకులు నియామకమయ్యారు. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) నాయకుడు కొత్త కాపు లక్ష్మారెడ్డి, ఆశిష్‌మూర్తిని నియమిస్తూ మంగళవారం కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని బీఎంఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాదగిరి సత్తయ్య, పవన్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

హత్యకేసులో ఒకరికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్: మద్యం మత్తులో డబ్బులకోసం హత్యకు పాల్పడిన వాంకిడి మండలం కేడేగాంకు చెందిన ఆత్రం బొజ్జిరావుకు జీవిత ఖైదుతో పాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పు చెప్పారు. జరిమానాలోని రూ. 50 వేలు మృతుని కుటుంబానికి చెల్లించాలన్నారు. లైజన్ అధికారి మహ్మద్ బషీర్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వాంకిడి మండలం సర్కేపల్లికి చెందిన తండ్రీకొడుకులు కోవ జలపతిరావు, కోవ మాణిక్‌రావు జనవరి 1, 2020న పత్తి అమ్మగా రూ.30 వేలు వచ్చాయి. డబ్బులు తీసుకుని వాంకిడి నుంచి ఆటోలో ఇంటికి బయలుదేరారు. అప్పుడే అక్కడికి వచ్చిన ఆత్రం బొజ్జిరావు బైక్‌పై జలపతిని తీసుకెళ్లాడు. మార్గమధ్యంలో మద్యం కొనుగోలు చేసి పత్తి చేనులో సేవించారు. జలపతిరావు మత్తులోకి వెళ్లడంతో బొజ్జిరావు అతని తలపై బండరాయితో మోది హతమార్చాడు. అతని వద్దనున్న రూ.30 వేలు తీసుకుని పారిపోయాడు. మృతుని కుమారుడు మాణిక్‌రావు ఫిర్యాదు మేరకు వాంకిడి పోలీస్ స్టేషన్‌లో సీఐ రాణాప్రతాప్ కేసు నమోదు చేశారు. 23 మంది సాక్షులను ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పై తీర్పు చెప్పారు.

క్షణికావేశంలో తప్పులు చేయవద్దు



మాట్లాడుతున్న జడ్జి అసదుల్లా షరీఫ్

దండేపల్లి: క్షణికావేశంలో తప్పులు చేసి, ఆ తరువాత కోర్టుల చుట్టూ తిరుగవద్దని లక్సెట్టిపేట జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. దండేపల్లి మండలం కొర్విచెల్మలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే తప్పులు చేయకుండా జాగ్రత్త పడతారన్నారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేందర్, రాజేశ్వర్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సర్పంచ్ భీమ్, న్యాయవాదులు రాజేశ్వరరావు, శ్రీధర్, సురేందర్, రవీందర్, రహ్మతుల్లా, ప్రకాశం, సత్యం, తాజొద్దీన్, అశోక్, రవిరాజ్, వినీత, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.